## నిఘానేత్రంలో ఆదిలాబాద్ జిల్లా

### నూతన సిసిటివి కెమెరాలను ప్రారంభించిన డిజిపి



**ప్రజాపక్షం/ఆదిలాబాద్:** ఆదిలాబాద్ జిల్లాలో ప్రజల భద్రతను మరింత బలోపేతం చేయడం, నేరాల నియంత్రణ, విచారణను సమర్థవంతంగా నిర్వహించడం కోసం ఏర్పాటు చేసిన 300 నూతన సిసిటివి కెమెరాలను రాష్ట్ర డిజిపి సీ.వీ ఆనంద్ బుధవారం ఉదయం స్థానిక కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో ప్రారంభించారు. అంతకుముందు పోలీస్ గెస్ట్ హౌస్ వద్ద జిల్లా సాయుధ సిబ్బంది నుండి ఆయన పోలీస్ వందనం స్వీకరించారు. అనంతరం ప్రాంగణంలో ఒక మొక్కను నాటారు. జిల్లా వ్యాప్తంగా ఏర్పాటు చేసిన ఈ కెమెరాల ద్వారా ప్రజల రక్షణ, ట్రాఫిక్ పర్యవేక్షణ, నేరాల నివారణ, నిందితుల గుర్తింపు వంటి అంశాలలో పోలీసు శాఖకు మరింత సహకారం అందనుంది. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తూ ప్రజలకు మరింత మెరుగైన భద్రతా సేవలు అందించేందుకు తెలంగాణ పోలీస్ శాఖ కట్టుబడి ఉందని తెలిపారు.ఉమెన్ సేఫ్టీ, సిఐడి, ఎసిబి డిజి చారు సిన్హా, మల్టీజోన్1 ఐజీ ఎస్ చంద్రశేఖర్ రెడ్డి, జిల్లా ఎస్‌పి అఖిల్ మహాజన్, అదనపు ఎస్‌పి పి. మౌనిక, ఉట్నూర్ ఎఎస్‌పి రుత్విక్ సాయి కొట్టే, ఆదిలాబాద్ డీఎస్పీ ఎల్.జీవన్‌రెడ్డి, పట్టణ సిఐ బి.సునీల్ కుమార్, పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## రైతులకు సరిపడా యూరియా నిల్వలు

### కలెక్టర్ ప్రతిమా సింగ్



**ప్రజాపక్షం/మెదక్ :** జిల్లాలో రైతుల అవరాలకు సరిపడా 6,515 మెట్రిక్ టన్నుల యూరియా నిల్వలు అందుబాటులో ఉన్నాయని, స్టాక్ పాయింట్ల ద్వారా సరఫరా జరుగుతోందని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ తెలిపారు. ఎరువుల నిల్వలు ప్రతి కేంద్రంలో అందుబాటులో ఉండేలా నిరంతర పర్యవేక్షణ చేపట్టామని పేర్కొన్నారు. యాసంగి 2025–26 సీజన్‌లో ఇప్పటివరకు 3.90 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసినట్లు కలెక్టర్ తెలిపారు. గత యాసంగిలో 3.20 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు కాగా, ఈసారి దిగుబడి పెరగడం తో కొనుగోళ్లు గణనీయంగా పెరిగాయని చెప్పారు. కొనుగోలు చేసిన ధాన్యానికి సంబంధించి రూ. 720 కోట్లను రైతుల ఖాతాల్లో నేరుగా జమ చేసినట్లు వెల్లడించారు. జిల్లాలో సుమారు 95 శాతం ధాన్యం కొనుగోళ్లు పూర్తయ్యాయని, ఇంకా 10 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం మాత్రమే కొనుగోలుకు మిగిలి ఉందన్నారు. మిగిలిన ధాన్యాన్ని రెండు రోజుల్లో పూర్తిగా కొనుగోలు చేసేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టామని తెలిపారు. అకాల వర్షాల కారణంగా తడిసిన ధాన్యాన్ని కూడా ప్రభుత్వ నిబంధనల మేరకు కొనుగోలు చేస్తున్నామని రైతులు ఎలాంటి ఆందోళన చెందవద్దని సూచించారు. నిరంతరం తనిఖీలు నిర్వహిస్తున్నాయని, కొల్చారం మండలంలోని మల్లికర్జున ఎరువుల దుకాణానికి స్టాప్ సేల్స్ అంశంపై నోటీసులు జారీ చేసినట్లు కలెక్టర్ తెలిపారు.

## రోడ్డు భద్రతా నియమాలు పాటించాలి



**ప్రజాపక్షం/ఆసిఫాబాద్ :** ప్రతి ఒక్కరు రోడ్డు భద్రతా నియమాలను తప్పనిసరిగా పాటించాలని జిల్లా ఎస్పీ నితికా పంత్ సూచించారు. 'అరైవ్ అలైవ్' కార్యక్రమంలో భాగంగా బుధవారం ఆసిఫాబాద్ ప్రభుత్వ వైద్య కళాశాలలో విద్యార్థులకు రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ద్విచక్ర వాహనాలు నడిపే ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించాలని, నాలుగు చక్రాల వాహనాల్లో సీటు బెల్టులు వినియోగించాలని తెలిపారు. ప్రతి సంవత్సరం దేశవ్యాప్తంగా లక్షలాది రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని, వీటిలో యువత అధికంగా ప్రాణాలు కోల్పోవడం బాధాకరమని అన్నారు. ట్రిబుల్ రైడింగ్, మద్యం సేవించి వాహనం నడపడం,మొబైల్ ఫోన్ ఉపయోగిస్తూ డ్రైవింగ్ చేయడం, రాంగ్ సైడ్‌లో వాహనం నడపడం వంటి నిర్లక్ష్య చర్యల వల్లే ఎక్కువ శాతం ప్రమాదాలు సంభవిస్తున్నాయని ఎస్పీ పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరిస్తూ ట్రాఫిక్ నియమాలను పాటిస్తే ప్రమాదాలను గణనీయంగా తగ్గించవచ్చని అన్నారు. జిల్లా అదనపు ఎస్పీ చిత్తరంజన్, ఆసిఫాబాద్ డీఎస్పీ అశోక్, ప్రభుత్వ వైద్య కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ డాక్టర్ ప్రియదర్శిని, ఆసిఫాబాద్ ఇన్‌స్పెక్టర్ బాలాజీ వరప్రసాద్, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ సతీష్, మెడికల్ కాలేజ్ విద్యార్థులు పాల్గొన్నారు.

## ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి

**ప్రజాపక్షం/బోథ్ :** ప్రతి ఒక్కరు విధిగా మొక్కలను నాటాలని ఆటవీ శాఖ బోథ్ రేంజ్ అధికారి కవిత అన్నారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా బుధవారం బోథ్ మండలం కౌట బి, గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో బోథ్ నేచర్ కన్జర్వేషన్ సొసైటీ ఆధ్వర్యంలో అటవీశాఖ సౌజన్యంతో మొక్కలను నాటారు. అనంతరం అటీ శాఖ రేంజ్ అధికారి కవిత మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. అటవీ సంపదను, వన్యప్రాణులను కాపాడడం ద్వారా ప్రకృతి సమతూల్యతను పరిరక్షించవచ్చని తెలిపారు. ప్రతి వ్యక్తి కనీసం ఒక మొక్కను నాటి దానిని సంరక్షించాలని సూచించారు. వన్యప్రాణులను వేటాడడం చట్టరిత్యా నేరమని అలాంటి వారిపై చట్టరిత్యా చర్యలు తీసుకుంటామని ఎఫ్ఆర్ఓ.హెచ్చరించారు. అటవీ, వన్యప్రాణీ సంరక్షణలో ప్రజల భాగస్వామ్యం ఎంతో అవసరమని ఆమె అన్నారు. అలాగే వన్యప్రణుల సంరక్షణకు ప్రజలు సహకరించాలని కోరారు. భవిష్యత్ తరాలకు కాలుష్య రహిత వాతావరణాన్ని అందించాలని కోరారు. పర్యావరణ పరిరోణకు ప్రతి ఒక్కరూ తోడ్పాటును అందించాలని అన్నారు.సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షుడు ఓరుగంటి స్వామి, ఉప సర్పంచ్ ఇట్టేడి రమణా రెడ్డి, గ్రామాభివృద్ధి కమిటి అధ్యక్షుడు, పిడుగు అశోక్‌రెడిడ, పాఠశాల ఉపాధ్యాయుడు శ్రీరాం, ప్రకాష్, అటవీ వేదికారులు వసంత్, నాగారావు, బోథ్ నేచర్ కన్జర్వేషన్ సొసైటీ సభ్యులు వెండి పృత్వి అబ్దుల్ రావుఫ్, రమణ గౌడ్, సోమేష్ రాజు, సబీర్ ప్రశాంత్ పాల్గొన్నారు.

## జిల్లాకు ఐదుగురు తాత్కాలిక తహసీల్దార్లు

**ప్రజాపక్షం/నిజామాబాద్:** జిల్లాలో ఖాళీగా ఉన్న వివిధ మండలాలకు తాల్కలిక (అడ్‌హక్) పద్ధతిలో తహసీల్దార్లను కేటాయించారు. రాష్ట్రవ్యాప్తంగా ఎన్నికల కమీషన్ ఆదేశాల మేరకు ఇంటింటి సర్వే (సర్) నిర్వహించనున్నారు. ఈనెల 25 నుంచి సర్ ప్రారంభం కానుంది. స్వంత జిల్లాకు చెందిన వారు మండలాధికారిగా ఉండరాదనే నిబంధనలున్నాయి. సీసీఎల్‌ఎ కమీషనర్ లోకేష్ కుమార్ డిప్యూటీ తహసీల్దార్ ఇన్‌చార్జి తహసీల్దార్లుగా ఉన్న నాలుగు మండలాలకు మూడు జిల్లాలకు చెందిన డీటీలను తాత్కలిక తహసీల్దార్లుగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. జగిత్యాల్ జిల్లా నుంచి పరంకుశం శ్రీకాంత్, ఖాజా షమి అహ్మద్, నిర్మల్ జిల్లా నుంచి ఎస్ మంజుల, తలారి పుష్ప, ఆదిలాబాద్ జిల్లా నుంచి దోమటి శేఖర్ రానున్నారు. వీరిని నిజామాబాద్ రూరల్, నిజామాబాద్ నార్త్, ఎడపల్లి, రెంజల్‌తో పాటు కలెక్టరేట్‌లో నియమించనున్నారు.

**జిల్లా నుంచి వెళుతున్న డిటిలు వీరే :** జిల్లాలోని ఐదుగురు డీటీలకు తాత్కలిక తహసీల్దార్లుగా పదోన్నతి కల్పిస్తూ నిర్మల్, ఆదిలాబాద్ జిల్లాలకు కేటాయించారు. వైఎస్ ప్రవీన్‌కుమార్, గంగాధర్, రాజశేఖర్, అసియా ఫాతిమ, దీపరాణి జిల్లాను వీడనున్నారు.

## నిజాంసాగర్ ప్రాజెక్టు నిలకడగా..

# కాళేశ్వరం పునాదులు కదిలాయ్

- ఉత్తర తెలంగాణ ప్రాజెక్టులకు అధిక ప్రాధాన్యత
- కాలువ కట్టలపై సోలార్ విద్యుత్ ఉత్పత్తికి చర్యలు
- జాకోరా, చందూర్ ఎత్తిపోతల పథకాలను ప్రారంభించిన మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి



**ప్రజాపక్షం/బోధన్:** నవాబుల కాలంలో నిర్మించిన నిజాంసాగర్ ప్రాజెక్టు వందేళ్ల పైబడిన నిలకడగా ఉందని, గత ప్రభుత్వ హయాంలో కేసీఆర్ నిర్మిస్తున్న కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణ పనులు పూర్తికాకుండానే పునాదులు కదిలాయని రాష్ట్ర భారీ నీటి పారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి విమర్శించారు. ఉత్తర తెలంగాణ జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టులకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నామని మంత్రి స్పష్టం చేశారు. నిజామాబాద్ జిల్లా వర్ని మండలం సిద్దాపూర్ రిజర్వాయర్ నిర్మాణ పనులను మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి బుధవారం ప్రభుత్వ సలహాదారు పోచారం శ్రీనివాస్ రెడ్డి, పార్లమెంట్ సభ్యులు సురేష్ షెట్కార్ తదితరులతో కలిసి క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. రిజర్వాయర్ కు సంబంధించిన వివరాలతో ఏర్పాటు చేసిన ఫోటో ఎగ్జిబిషన్ ను తిలకించారు. 106కోట్ల రూపాయాల వ్యయంతో 7,975 ఎకరాల ఆయకట్టుకు నీరందించే జాకోరా, చందూర్ ఎత్తిపోతల పథకాలను అట్టహాసంగా ప్రారంభించారు. హెలికాప్టర్‌లో సిద్దాపూర్ చేరుకున్న మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డిని ప్రభుత్వ సలహాదారు పోచారం శ్రీనివాస్ రెడ్డి, జహీరాబాద్ పార్లమెంట్ సభ్యులు సురేష్ షెట్కార్, నిజామాబాద్ కలెక్టర్ ఇలా త్రిపాఠి, కామారెడ్డి జిల్లా ఎస్పీ రాజేష్ చంద్ర, నిజామాబాద్ అదనపు డీసీపీ శుభం నగ్రాలే, డీఎఫ్ఓ సిద్దార్థ విక్రమ్ సింగ్ తదితరులు హెలిప్యాడ్ వద్ద మంత్రికి పుష్ప గుచ్చాలు అందించి ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా జాకోరాలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడారు. సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం సాగునీటి రంగానికి, పౌర సరఫరాలకు ఎనలేని ప్రాముఖ్యత ఇస్తుందని గుర్తు చేశారు. ఉమ్మడి జిల్లా వరప్రదాయిని నిజాంసాగర్, ఉత్తర తెలంగాణ జిల్లాలకు అత్యంత కీలకమైన శ్రీరాంసాగర్ ప్రాజెక్టులలో కూడా పూడికతీత చేపట్టి రిజర్వాయర్ల నిల్వ సామర్థ్యం పెంపొందిస్తామని ప్రకటించారు. రాష్ట్ర వ్యాప్తంగా మారుమూల ప్రాంతాల్లో సైతం రైతులు పండించిన ప్రతి గింజను ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని మంత్రి భరోసా కల్పించారు. మొత్తం లక్ష 48వేల ఎకరాలలో పంటలు పటండిస్తున్నారని, 95వేల ఎకరాల ఆయకట్టుకు నిజాంసాగర్ నీరు సమకూరుతోందని తెలిపారు. 30వేల ఎకరాలకు ఎత్తిపోతల పథకాల ద్వారా సాగు జలాలు అందిస్తున్నామన్నారు. మాజీ డీసీసీబీ ఛైర్మన్ పోచారం భాస్కర్ రెడ్డి, రాష్ట్ర నీటి పారుదల శాఖ ప్రిన్సిపాల్ సెక్రెటరీ శ్రీధర్, జాయింట్ సెక్రెటరీ శ్రీనివాస్ రావు, ఇంజనీర్ ఇన్ ఛీఫ్ శ్రీనివాస్, సీఈ శ్రీదేవి, బోధన్ ఆర్డీఓ విజయ కుమారి, తహసీల్దార్ ప్రశాంత్, , సర్పంచ్‌లు, మార్కెట్ కమిటీ ఛైర్మన్ సురేష్ బాబా, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు కూనిపూర్ రాజారెడ్డి, గోపాల్, కల్లాల్ గిరి, ప్రజలు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదాల నివారణకు..

# సమష్టి కృషి అవసరం

### కలెక్టర్ ప్రతిమా సింగ్, అడిషనల్ డిజి సంజయ్

**ప్రజాపక్షం/మెదక్ :** మెదక్ జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణకు సమష్టి కృషి అవసరమని, ప్రజల భాగస్వామ్యంతోనే గ్రామాల అభివృద్ధి సాధ్యమవుతుందని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ పేర్కొన్నారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా మాసాయిపేట జిల్లా పరిషత్ హైస్కూల్‌లో బుధవారం నిర్వహించిన గ్రామసభ, అరైవ్ అలైవ్ రోడ్డు భద్రత అవగాహన ర్యాలీ లో అడిషనల్ డీజీ సంజయ్ కుమార్ జైన్, జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు తో కలిసి కలెక్టర్ ప్రతిమా సింగ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గ్రామసభల ద్వారా ప్రజా సమస్యల పరిష్కారానికి అవకాశం కలుగుతుందన్నారు. పచ్చదనం, పారిశుధ్యం, చెత్త నిర్వహణ, తాగునీటి వనరుల సంరక్షణపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని గ్రామాల్లో పారిశుధ్య చర్యలను మరింత పటిష్టం చేయాలన్నారు. అడిషనల్ డీజీ సంజయ్ కుమార్ జైన్ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల్లో ఒక్క ప్రాణం కూడా కోల్పోకుండా అధికారులు సంకల్పంతో పనిచేయాలని అన్నారు. పోలీసు, రవాణా, ఆర్టీసీ తదితర శాఖలు సమన్వయంతో పనిచేస్తే ప్రమాదాలను గణనీయంగా తగ్గించవచ్చని తెలిపారు. జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు మాట్లాడుతూ హెల్మెట్, సీటుబెల్ట్ వినియోగం లేకపోవడం వల్లే ఎక్కువ మంది ప్రాణాలు కోల్పోతున్నారని పేర్కొన్నారు. అతివేగం, మద్యం సేవించి డ్రైవింగ్, మొబైల్ ఫోన్ మాట్లాడుతూ వాహనాలు నడపడం వంటి నిర్లక్ష్యాలే ప్రమాదాలకు ప్రధాన కారణమని హెచ్చరించారు. కార్యక్రమంలో విద్యార్థుల, ప్రజలతో కలిసి రోడ్డు భద్రత ర్యాలీ నిర్వహించగా, పోలీసు కళాబృందం పాటల ద్వారా అవగాహన కల్పించింది. పాల్గొన్నా వారితో రోడ్డు భద్రత ప్రతిజ్ఞ చేయించారు. అదనపు ఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్, జిల్లా పంచాయతీ అధికారి యాదయ్య, రవాణా శాఖ అధికారి శ్రీకాంత్ చక్రవర్తి, తూప్రాన్ ఆర్డాఓ బావయ్య పాల్గొన్నారు.



## పాఠశాల భవనానికి మౌలిక వసతులు

### కలెక్టర్ హరిత



**ప్రజాపక్షం/కాగజ్ నగర్ :** గత పదేళ్లుగా మూతపడిన ప్రభుత్వ పాఠశాల భవనానికి మరమ్మత్తులు చేసి మౌలిక వసతులు కల్పించి తిరిగి వినియోగంలోకి తీసుకువచ్చేందుకు సాధ్యసాధ్యాలు పరిశీలించాలని జిల్లా కలెక్టర్ కె. హరిత అధికారులను ఆదేశించారు. బుధవారం కాగజ్ నగర్ పట్టణంలోని 13వ వార్డు కాపు వాడలో గల మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల భవనం మూతపడి ఉన్న విషయాన్ని తెలుసుకొని విద్యాశాఖ అధికారులతో కలిసి ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం విద్యా వ్యవస్థను బలోపేతం చేస్తూ అనేక కార్యక్రమాలు అమలు చేస్తోందని తెలిపారు. ఈ క్రమంలో పాఠశాలను పునరుద్ధరించేందుకు గల సాధ్యసాధ్యాలను విద్యాశాఖ అధికారులను అడిగి తెలుసుకున్నారు. మౌలిక సదుపాయాలు కల్పించి పునఃప్రారంభించే దిశగా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి వాసాల ప్రభాకర్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## మందమర్రిలో జర్మన్ భాషా శిక్షణ కేంద్రం ప్రారంభం

### మంత్రి డా. జి. వివేక్ వెంకటస్వామి



**ప్రజాపక్షం/మందమర్రి :** విదేశీ ఉపాధి అవకాశాలను విస్తరించేందుకు తెలంగాణ ఓవర్సీస్ మాన్‌పవర్ కంపెనీ లిమిటెడ్ (టామ్‌కామ్), ఉపాధి, శిక్షణ శాఖ సంయుక్త ఆధ్వర్యంలో మందమర్రి పట్టణంలోని ఇల్లందు క్లబ్‌లో ఏర్పాటు చేసిన జర్మన్ భాషా శిక్షణ కేంద్రాన్ని రాష్ట్ర కార్మిక, ఉపాధి, గనుల శాఖ మంత్రి డా. జి. వివేక్ వెంకటస్వామి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రపంచీకరణ యుగంలో విదేశీ భాషలపై పట్టు సాధించడం యువత కెరీర్ ఎదుగుదలకు అత్యంత కీలకమని అన్నారు. జర్మనీ వంటి అభివృద్ధి చెందిన దేశాల్లో నైపుణ్యం కలిగిన యువతకు భారీ స్థాయిలో ఉద్యోగ అవకాశాలు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. తెలంగాణ యువత ఆ అవకాశాలను అందిపుచ్చుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణతో ముందుకు సాగుతోందని మంత్రి తెలిపారు. టామ్‌కామ్ ద్వారా జర్మన్ భాషా శిక్షణతో పాటు నైపుణ్యాభివృద్ధి, వ్యక్తిత్వ వికాసం, కెరీర్ మార్గదర్శకత్వం, విదేశీ ఉద్యోగ అవకాశాల కల్పన వంటి సమగ్ర కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ప్రభుత్వం కల్పిస్తున్న ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకుని విదేశీ భాషల్లో ప్రావీణ్యం సాధించి ప్రపంచ ఉద్యోగ రంగంలో తమదైన ముద్ర వేయాలని యువతకు పిలుపునిచ్చారు. ఈ శిక్షణ కేంద్రం ద్వారా యువతకు అంతర్జాతీయ ఉద్యోగ అవకాశాల మార్గం సుగమం కానుందని, ప్రపంచ స్థాయి కెరీర్ నిర్మాణానికి ఇది ఒక బలమైన వేదికగా నిలవనుందని పలువురు అభిప్రాయపడ్డారు.

## గ్రామ సభలతో గ్రామాల అభివృద్ధి



**ప్రజాపక్షం/వెల్దుర్తి :** ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా ఈరోజు మాసాయిపేట మండల కేంద్రం లోని జిల్లా పరిషత్ హై స్కూల్ గ్రామ సభలో అరైవ్ అలైవ్ రోడ్డు భద్రత, పరిసరాల పరిశుభ్రత, అవగాహన కార్యక్రమం నిర్వహించి పోలీసుల ఆధ్వర్యంలో విద్యార్థులు, పౌరులు లతో కలిసి అరైవ్ అలైవ్ రోడ్డు భద్రత ర్యాలీ నిర్వహించడం జరిగినది. అనంతరం పౌరులకు అవగాహన సదస్సు నిర్వహించడం జరిగినది. పరిసరాల పరిశుభ్రత, అరైవ్ అలైవ్ ఈ అవగాహన ర్యాలీ, అవగాహన సదస్సుకు జిల్లా కలక్టర్ ప్రతిమా సింగ్, అడిషనల్ డీజీ సంజయ్ కుమార్ జైన్, ఎస్పీ శ్రీనివాస్ రావు హాజరై కార్యక్రమాలను ప్రారంభించారు. పౌరులతో కలసి ర్యాలీ నందు పాల్గొన్నారు. కలక్టర్ ప్రతిమా సింగ్ మాట్లాడుతూ, ప్రజల భాగస్వామ్యం తోనే గ్రామాల అభివృద్ధి జరుగుతుందని గ్రామసభలతో ప్రజా సమస్యల పరిష్కారం పచ్చదనం, పారిశుధ్యంపై దృష్టి సారించాలి. తడి చెత్త, పొడి చెత్త నిర్వహణ పక్కాగా జరగాలని, బహిరంగ ప్రదేశాల్లో అస్సలు చెత్త వేయకూడదని, తగుల బెట్టకూడదన్నారు. ప్రజలను చైతన్య పరుస్తున్నాం అన్నారు. అడిషనల్ డీజీ సంజయ్ కుమార్ జైన్ మాట్లాడుతూ, జిల్లా వ్యాప్తంగా అరైవ్ అలైవ్ రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగినది.

## రోడ్డు భద్రతపై 'అరైవ్ అలైవ్'తో ప్రజలకు అవగాహన

### డిజిపి మహేష్ మురళీధర్ భగవత్



**ప్రజాపక్షం /సంగారెడ్డి :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ప్రజల పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా సంగారెడ్డి జిల్లా ఫసల్వాది గ్రామంలో నిర్వహించిన గ్రామ సభకు తెలంగాణ రాష్ట్ర డైరెక్టర్ జనరల్ ఆఫ్‌పోలీసు ( లా అండ్ ఆర్డర్)మహేశ్ మురళీధర్ భగవత్ ముఖ్య అతిథిగ హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ రోడ్డు భద్రత ప్రతి ఒక్కరూ బాధ్యత అని అన్నారు. చిన్న మొబైల్ కొనుగోలు చేస్తేనే స్క్రీన్ గార్డు వేయిస్తానని మొబైల్ కంటే మన ప్రాణాలు ,మన ప్రయాణం ఎంతో విలువైనదని గుర్తించాలని సూచించారు. మన ప్రాణరక్షణ లో భాగమైన హెల్మెట్ ను తప్పని సరిగా కొనుగోలు చేసి వినియోగించాలని సూచించారు. కార్లలో ప్రయాణించేటప్పుడు డ్రైవర్ మాత్రమే కాకుండా ప్రయాణికులందరు. సీటు బెల్టు ధరించాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లోను మద్యం సేవించి వాహనం నడపరాదని ,మద్యం సేవించినట్లయితే ప్రత్యామ్నాయ రవాణా సౌకర్యాలను వినియోగించాలని తెలిపారు. పండుగలకు ,అల్లుళ్లకు కొత్త బట్టలు బహుమతిగా ఇచ్చేసంప్రదాయం తెలంగాణ ప్రజలదని, తన తరపున ఒక సూచనగా వారి ప్రాణరక్షణకు ఉపయోగపడే హెల్మెట్ ను బహుమతిగా ఇస్తే మరింత మంచిదని అన్నారు. రహదారులపై వాహనాదారులు ట్రాపిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని అతివేగం, నిర్లక్ష్యం వాహనం , నడపడం మద్యం సేవించ వాహనాలు నడపడం వల్ల ప్రమాదాలు సంభవిస్తున్నాయని తెలిపారు. గమ్యస్థానికి చేరుకోవడం ముఖ్యమే కాని సురక్షతంగా చేరుకోవడం మరింత ముఖ్యమైనదని అనే భావనతో అరైప్ అలైప్ సందేశాన్ని ప్రజల్లోకి తీసుకువెళ్తున్నామని చెప్పారు. ద్వి చక్ర వాహనదారులు హెల్మెట్ కార్లలో ప్రయణించే వారు సీటు బెల్ట్ తప్పని సరిగా ధరించాలని సూచించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రజల భాగస్వామ్యం అత్యంత అవసరమని ప్రతి ఒక్కరూ బాద్యత యుతంగా వ్యవహరిస్తే ప్రమాదాల సంఖ్యను గణనీయంగా తగ్గించవచ్చని తెలిపారు. యువత ట్రాపిక్ నిబంధనల పట్ల అవగాహన పెంచుకుని ఇతరలకు కూడా చైతన్యం కల్పించాలని కోరారు. గ్రామ ప్రజలతో రోడ్డు భద్రత ప్రతిజ్ఞ చేయించి హెల్మెట్లను పంపిణి చేసారు. జిల్లా ఎస్పీ ఫంకజ్ మాట్లాడుతూ సంగారెడ్డి జిల్లా ప్రజలను రోడ్డు ప్రమాదాల పట్ల అప్రమత్తం చేసి రోడ్డు భద్రతపై అవగాహన కల్పించేందుకు డిజిపి మహేష్ మురళీదర్ భగవత్ పసల్వాడీ గ్రామానికి రావడం అరైప్ అలైప్ కార్యక్ర మం ప్రాదాన్యతను తెలియజేస్తుందని అన్నారు.

# దినదిన గండంగా రైతన్న బతుకు!

- ఫెర్టిలైజర్ యాప్‌తో ఎరువుల కోసం పడిగాపులు
- వానకాలం మొదలైనా అందని యూరియా...



**ప్రజాపక్షం / రెబ్బన :** తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన ఫెర్టిలైజర్ యాప్‌తో రైతులకు తిప్పలు మొదలయ్యాయి. వానకాలం సీజన్ ప్రారంభమైనప్పటికీ యూరియా కష్టాలు వెంటాడుతున్నాయి. ఆసిఫాబాద్ జిల్లా రెబ్బెన మండలంలో అడుగడుగునా అడ్డంకులు ఎదురవుతుండటంతో ఎరువుల కోసం రైతులు పడిగాపులు కాస్తున్నారు.

### ఒటిపి రాక.. సర్వర్ దొరకక..

కౌలు రైతుల పరిస్థితి అత్యంత అయోమయంగా మారింది. భూమి యజమానులకు ఫోన్ చేసి యూరియా బుక్ చేసుకుంటే కేవలం 24 గంటలు మాత్రమే కాలపరిమితి ఉంటుందని వాపోతున్నారు. తీరా ఫెర్టిలైజర్ షాప్‌కు వెళ్తే సర్వర్ డౌన్ కావడం, అనుకున్న సమయానికి ఒటిపిలు రాకపోవడంతో యూరియా అందడం లేదని రైతన్నలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### వర్షం పడితే అంతే సంగతి!

ప్రతి ఏటా రైతులు వానకాలానికి ముందే మే నెలలోనే బస్తాలను తెచ్చి పొలాల్లో నిల్వ చేసుకునేవారు. కానీ ఈసారి మాత్రం జూన్ ప్రారంభమైనప్పటికీ ఒక బస్తా కూడా లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వర్షం పడితే పొలాల్లోకి బస్తాలు తీసుకెళ్లలేని పరిస్థితి ఉంటుందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పంటకు వాడే ఎరువులకు యాప్ పెట్టడంపై ప్రభుత్వంపై మండిపడుతున్నారు.

### ధరల భారం.. డీలర్ల ఇష్టారాజ్యం

ఫెర్టిలైజర్ యాప్‌తో నానా తంటాలు పడుతున్నామని నారాయణపూర్ రైతు మాదాసు ప్రసాద్ ఆవేదన వ్యక్తం చేశారు. తనకు పది ఎకరాలు ఉండగా, ఎనిమిది ఎకరాల్లో పత్తి సాగు చేస్తున్నట్లు తెలిపారు. యాప్‌లో మొదటి విడత ఎనిమిది బస్తాలు బుక్ అవ్వడానికే మూడు రోజులు పట్టిందని, అవి ఎనిమిది ఎకరాలకు సరిపోవట్లేదని అన్నారు. 2020, డిఏపి బస్తాల ధరలు పెరగడం వల్ల ఆర్థిక భారం ఎక్కువైందని, డీలర్లు తెలిసిన వారికే ఇస్తూ ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

### సరిపడా నిల్వలు ఉన్నాయి

రెబ్బెన మండలంలో 38 వేల ఎకరాల సాగుభూమికి 3000 మెట్రిక్ టన్నుల యూరియా అవసరమని మండల వ్యవసాయ అధికారి దిలీప్ కుమార్ తెలిపారు. ఇప్పటివరకు 500 మెట్రిక్ టన్నుల అమ్మకాలు జరిగాయని, మరో 600 మెట్రిక్ టన్నుల నిల్వ ఉందని, అవి త్వరలోనే అందుబాటులోకి వస్తాయన్నారు. ప్రస్తుతం ఆసిఫాబాద్ జిల్లాలోనే ఈ యాప్ ఓపెన్ అయిందని, ఎకరానికి రెండు బస్తాల యూరియా సరిపోతుందని తెలిపారు.

## ఇరు పక్షాలు లబ్ధిపొందటమే జాతీయ లోక్ అదాలత్ లక్ష్యం

### జిల్లా ప్రధాన న్యాయమూర్తి భరతలక్ష్మి

**ప్రజాపక్షం/నిజామాబాద్ అర్బన్ :** జాతీయ లోక్ అదాలత్‌ల ద్వారా కక్షిదారులు ఇరువురికి న్యాయ సమ్మితమైన, ఆమోదయోగ్యమైనదై కక్షిదారులు ఒకరు గెలిచి మరొకరిని గెలిపించడం (విన్ విన్నింగ్ సిచువేషన్) తో ఇరువురు గెలుపొందించడం ద్వారా సమయం, డబ్బు ఆదా అవుతాయని నిజామాబాద్ ప్రధాన న్యాయమూర్తి భరతలక్ష్మి అన్నారు. బుధవారం జిల్లా న్యాయమూర్తి చాంబర్‌లో రెండవ జాతీయ లోక్ అదాలత్ గోడప్రతిని విడుదల చేసి, విలేకరుల సమావేశం నిర్వహించారు.రెండవ జాతీయ లోక్ అదాలత్ జూన్ 20వ తేదీన తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా అన్ని కోర్టులలో నిర్వహించబడుతుందని అన్నారు. అందులో భాగంగా నిజామాబాద్ జిల్లాలో జాతీయ లోక్ అదాలత్‌లో పరిష్కారానికి నోచుకోబడినటువంటి సివిల్, బ్యాంకింగ్, కుటుంబ సంబంధ వ్యాజ్యాలు, కార్మిక సంబంధం కేసులు, ప్రమాద కేసులు తదితర కేసులను 3508 గుర్తించడం జరిగిందన్నారు. దీనికి సంబంధించి 3009 కేసులకు సంబంధించి సంబంధిత కక్షిదారులకు నోటీసులు పంపించడం జరిగిందని అన్నారు. 20వ తేదీన నిర్వహించనున్న రెండవ జాతీయ లోక్ అదాలత్‌లో సుదూర ప్రాంతాల్లో ఉన్నటువంటి (కేసులకు సంబంధించి ప్రత్యక్షంగా హాజరుకాలేనటువంటి వారు) కేసులకు సంబంధించిన వ్యక్తులు రాలేని పరిస్తితుల్లో ఉంటే వారికి వీడియో కాల్స్ ద్వారా పరిష్కారానికి అవకాశం కల్పించారని తెలిపారు. కావున ఇట్టి రెండో జాతీయ లోక్ అదాలత్‌ను పెద్ద సంఖ్యలో కక్షిదారులు వినియోగించుకొని మానసిక వేదన లేకుండా, ఎక్కువ సంతోషాన్ని పొందాలని అదేవిధంగా సమాజానికి, కుటుంబానికి మనశ్శాంతిని ప్రసాదించిన వారు అవుతారని అన్నారు. జిల్లాలోని మారుమూల గ్రామప్రజలు సైతం ఇట్టి అవకాశాన్ని వినియోగించుకోవాలని ఈ సందర్భంగా కోరారు.

